చదువు

ఈనాడు హైదరాబాద్ 8

మంగళవారం ఫిబ్రవరి 6, 2018 ■ e-mail: edc@eenadu.in

అభ్యర్థి అత్యంత నైపుణ్యాలు కలిగి ఉన్నప్పటికీ సానుకూలత, సహానుభూతి, సహనం, విశ్వసనీయత, విశాల దృక్పథం లేకపోతే ఏ సంస్థా ఉద్యోగం ఇవ్వడానికి సిద్ధపడదు. అందుకే ఆ లక్షణాలు లేని వారిని నిరోధించడానికి అనేక రకాల పరీక్షలు పెడుతుంది. అందులో హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ ఒకటి. అందరికీ దాదాపు ఒకే విధమైన ప్రశ్నలు ఉన్నప్పటికీ అభ్యర్థుల స్పందనలను అనుసరించి వారి వారి వైఖరులను పసిగట్టి వడగడతారు. ఈ కేస్ స్టడీలో సక్సెస్‌ఫుల్ అభ్యర్థి నమూనా సమాధానాలను తెలుసుకుందాం.



నైపుణ్యాలే కాదు.. అంతకు మించి!

హెచ్‌ఆర్: మీ గురించి చెప్పి, మా సంస్థలో ఎందుకు చేరాలనుకుంటున్నారో వివరించండి.

మొదటి అభ్యర్థి: నా పేరు రవి. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ నేషనల్ కళాశాల నుంచి 2017లో పాసయ్యాను. పదో తరగతి శివ స్కూల్ నుంచి 82%తో, ఇంటర్ రామా కళాశాల నుంచి 78%తో పాసయ్యాను. నాన్న పేరు సుబ్బారావు, ప్రభుత్వ ఉద్యోగి. అమ్మ పేరు సీత, గృహిణి.

వెంకట్ కాంచనపల్లి
సీఈఓ, సన్‌టెక్ కార్ప్

అన్నయ్య ఎంబీఏ చేసి ఒక ప్రైవేటు సంస్థలో రూ. 15,000 జీతంతో పనిచేస్తున్నాడు. అక్కయ్యకు పెళ్లి అయింది. తను గృహిణి. ఈమధ్యనే బాబు పుట్టాడు. ఆ బాబంటే నాకు చాలా ఇష్టం. నాకు జావా ప్రోగ్రామింగ్ మీద గట్టి పట్టు ఉంది. గొప్ప ఐటీ ఇంజినీర్ కావాలని కోరిక.

విశ్లేషణ: అభ్యర్థి తనకు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకోలేదు. రెజ్యూమేలో ఉన్న వివరాలూ, అప్రస్తుతమైనవీ చెప్పటం అనవసరం. తన ప్రొఫైల్ ఏంటో, ఎందుకు దరఖాస్తు చేస్తున్నాడో వివరించలేకపోయాడు.

రెండో అభ్యర్థి: నా పేరు విశాల్. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ కేకేఐటీ కళాశాల నుంచి 2017లో పాసయ్యాను. స్నేహితులతో కలిసి చిన్న చిన్న గేమింగ్ అప్లికేషన్స్ రూపొందించాను. ఒక ప్రముఖ సంస్థలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికై, ఒక ప్రత్యేక గేమింగ్ అప్లికేషన్ బేసిక్ వెర్షన్ రూపొందించాను. చదువు పూర్తయ్యాక అడ్వాన్స్‌డ్ వెర్షన్‌కు అవసరమైన అదనపు కోర్సులు చేశాను. గత నెల రోజులుగా ఇలాంటి అప్లికేషన్లను రూపొందిస్తున్న ప్రాజెక్టులు ఉన్న సంస్థలకు దరఖాస్తు చేస్తోంటే మీ సంస్థ నుంచి ఇంటర్వ్యూ కాల్ వచ్చింది.

విశ్లేషణ: ఇతడు ఈ ఇంటర్వ్యూకు ప్రాస్పెక్టివ్ అభ్యర్థి. ప్రొఫైల్ ఈ సంస్థలో ఉన్న స్థానానికి దగ్గరగా ఉంది. ఇలాంటి అవకాశం కోసం మాత్రమే వెతకడం అతడి సన్నద్ధత ప్రయాణాన్ని తెలియజేస్తోంది.

హెచ్‌ఆర్: మీ స్వల్పకాలిక, దీర్ఘకాలిక లక్ష్యాలు ఏమిటి?

రవి: రూ.25000తో ఒక మంచి సంస్థలో చేరి మా అమ్మానాన్నలను సంతోష పెట్టడం నా షార్ట్‌టర్మ్ ఆబ్జెక్టివ్. ఇక ఆ ఉద్యోగంలో ఒక 5-10 సంవత్సరాల్లో మేనేజర్ అయ్యి పెద్ద స్థాయికి చేరడం నా లాంగ్‌టర్మ్ ఆబ్జెక్టివ్.

విశ్లేషణ: భావోద్వేగాలతో డబ్బు, హోదా కోసం చూసే దృష్టి ఇతడిది. తన ప్రొఫైల్‌కు తగ్గట్టు పనిచేస్తే స్థాయి పెరిగి, దాని వల్ల అతడు ఆశించినవి నెరవేరతాయనే పరిణతి లేదు.

విశాల్: నాకు గేమింగ్ అప్లికేషన్స్ మీద పట్టు రావాలంటే మొదట ఆ ప్లాట్‌ఫాను కల్పించే మీలాంటి ఒక సంస్థలో ఉద్యోగం సాధించి, ఒక మూడేళ్లు అన్ని స్థాయిల అప్లికేషన్స్ బిల్డ్ చేసి అనుభవం గడించడం నా షార్ట్‌టర్మ్ ఆబ్జెక్టివ్. ఇక నా ఆలోచనలతో గేమింగ్‌లో వినూత్న ప్రయోగాలను ఆ తరువాత పడేళ్లు చేపట్టి, సంస్థకు ఆర్థికంగా సహకరించడం, వాటిని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం నా లాంగ్‌టర్మ్ ఆబ్జెక్టివ్.

విశ్లేషణ: నాలుగు వాక్యాల్లో తన కెరియర్ ప్రయాణాన్నీ, ప్రస్తుత స్థితినీ, భవిష్యత్ ప్రణాళికనూ వ్యక్తపరిచాడు. అతడికి ఈ సంస్థ మంచి ప్లాట్‌ఫాం అయితే, సంస్థకు మంచి అసెట్ అయ్యే అవకాశం ఉంది.

స్వభావ లక్షణాలు

హెచ్‌ఆర్ ఇంటర్వ్యూయర్‌కు వారిద్దరి ప్రొఫైల్ కెరియర్ జర్నీ, ప్రస్తుత స్థాయి, భవిష్యత్తు గురించి ఒక అవగాహన వచ్చింది. ఇంటర్వ్యూలో ముఖ్యమైన స్వభావ లక్షణాలను అర్థం చేసుకోవడానికి ఇక తరువాతి ప్రశ్నలకు సంసిద్ధమయ్యారు.

హెచ్‌ఆర్: మీరు ఇంటర్వ్యూకు చాలా దూరం ప్రయాణం చేసి వచ్చినట్టున్నారు. ఇక్కడ వెయిటింగ్ కూడా చాలా ఉన్నట్టుంది. ఏమైనా ఇబ్బంది అనిపించిందా?

రవి: అవును. మా ఇల్లు మీ ఆఫీస్‌కు 30 కి.మీ.ల దూరంలో ఉంది. అక్కడి నుంచి రావడానికి పొద్దున్నే 7 గంటలకు బయల్దేరి, బస్సుల్లో నానా తిప్పలు పడితే 9 గంటలకు చేరుకున్నాను. ఇక్కడ సెక్యూరిటీ అంతా చెక్ చేసి లోపలికి పంపించారు. చాలాసేపు వెయిటింగ్ హాల్లో ఎదురుచూసిన తరువాత నన్ను ఇంటర్వ్యూకు పిలిచారు.

విశాల్: మా ఇల్లు దూరమే. కానీ నా కెరియర్‌కు ప్లాట్‌ఫామ్‌ను ఏర్పరచగలిగే సంస్థ కోసం నేను విదేశాలకైనా వెళ్తాను. ఎందుకంటే సంస్థకు దరఖాస్తు చేసేవారు చాలామంది ఉంటారు. ఇంటర్వ్యూకి సమయం పడుతుంది. నేను దాన్ని ఇబ్బందిగా భావించను.

హెచ్‌ఆర్: మీరు అంతసేపు వెయిటింగ్ హాల్‌లో ఉన్నారు కదా! మరి ఏం గమనించారు?

రవి: అందరినీ పిలుస్తున్నారు. నన్నెప్పుడు పిలుస్తారా అనే ఉత్సాహంలో పెద్దగా ఏం గమనించలేదు.

విశాల్: నాకు ఆఫీస్ చాలా నచ్చింది. ఇంటర్వ్యూకు వచ్చినవారిని నేహ అనే హెచ్‌ఆర్ పర్సన్ ఒక వరుసలో కూర్చోబెట్టారు. ఇంకో హెచ్‌ఆర్ సందీప్ అందరికీ సూచనలు ఇచ్చారు. ఇంటర్వ్యూకు వెయిటింగ్ ఉంటుంది కాబట్టి, మాకు మంచినీళ్లు, టీ, కాఫీ, కూల్ డ్రింక్స్, స్నాక్స్ ఒక పక్క కౌంటర్‌లో ఏర్పాటు చేశారు. ఒక క్రమంలో 10 ప్యానెళ్లలోకి పంపిస్తున్నారు. సందేహాలు ఉంటే తీరుస్తున్నారు. అంతా వ్యవస్థీకృతంగా అనిపించింది.

విశ్లేషణ: రెండు ప్రశ్నలకూ రవి భావోద్వేగపరంగా స్పందించాడు. ఇబ్బందిని వ్యక్తపరిచాడు. అతడికి ఓపిక లేదని తెలుస్తోంది. ఉద్యోగంపై శ్రద్ధ లేకపోవడమో, ఇంకేదో కారణాలు కావచ్చు. ఇవన్నీ ప్రతికూల విషయాలే. విశాల్ విషయానికి వస్తే అతడికి తనకు కావాల్సిన దానిమీద అవగాహన ఉంది. ప్రశాంతతతో ఉండటం వల్ల అన్నీ శ్రద్ధగా గమనించగలిగాడు. స్పష్టత ఉంది. రేపు ఈ సంస్థలో చేరితే ఏ ప్రాంతానికైనా వెళ్లగలడు, ఉన్నతంగా పని చేయగలడు.

టీం వర్క్

హెచ్‌ఆర్: మీరు మీ టీం కలిసి ఒక ప్రాజెక్ట్ చేస్తున్నారు. మీ నాన్న ఆరోగ్యం బాగోలేకపోవడం వల్ల మీరు చేయాల్సిన పనిని సమయానికి చేయలేకపోతారు. మీతో ఎప్పుడూ పోటీపడే మీ టీం సభ్యుడు దాన్ని అవకాశంగా తీసుకుని మీరు పని చేయలేదని మేనేజర్‌కు చెప్పడం వల్ల మీరో ఇంక్రిమెంట్ కోల్పోతారు. తరువాత అదే పరిస్థితి ఆ సభ్యుడికి వచ్చి వాళ్ల తాతయ్యకు బాగాలేక సమయానికి పనిని అప్పజెప్పనపుడు మీరు అతనికి ఎలా బుద్ధి చెబుతారు?

రవి: నేను ఎప్పుడూ గొప్ప పెర్ఫార్మర్‌గా ఉండాలని కోరుకుంటాను. నా బృంద సభ్యుడు నన్ను దెబ్బ తీసినందుకు నాకు అవకాశం వస్తే పూర్తిగా సద్వినియోగపరచుకుంటాను. అతడికి ఇంక్రిమెంట్ పోయేలా చేసి బుద్ధి చెబుతాను.

విశాల్: నా ఉద్దేశంలో అతడు నన్ను దెబ్బతీయడం మూర్ఖత్వం. వ్యక్తి శక్తి కంటే బృంద శక్తి ఎంతో ఎక్కువ. అందుకే అందరూ కలిసి చేయాలి. ఎవరైనా ఇలాంటి అవగాహన లేక మూర్ఖత్వంగా ప్రవర్తిస్తే వారికి అవగాహన కల్పిస్తాను. కష్టసమయంలో తోడుగా ఉంటాను. కుదిరితే వారి పని కూడా నేనే చేస్తాను. దానివల్ల సానుకూల వాతావరణం ఏర్పడుతుంది.

విశ్లేషణ: రవి ఆంబిషన్, స్వార్థచింతన కలిగిన వ్యక్తి. సమైక్య భావాలు లేవు. బృందంలో పని చేయడానికి పనికిరాడు. విశాల్‌కు మెచ్యూరిటీ స్థాయి ఎక్కువ. అందుకే విషయాన్ని విశాల పరిధిలో చూడగలిగాడు, దానికి సరైన పరిష్కారాన్ని చెప్పగలిగాడు. అతడు టీంను నడిపించగలడు. భవిష్యత్తులో మేనేజర్ అవగలడు.

ఏ వైఖరి అనుకూలం?

హెచ్‌ఆర్ కోణంలో ఇద్దరి ఇంటర్వ్యూల సారాంశం ఇలా ఉంటుంది.

రవి అన్ని రౌండ్లూ క్లియర్ చేసి హెచ్‌ఆర్ రౌండ్ వరకు వచ్చాడంటే అతను నైపుణ్యాల పరంగా బాగానే ఉన్నట్టు. కానీ అతని వైఖరి సంస్థకు అనుకూలమైంది కాదు. అతడు స్కిల్స్‌ను మాత్రమే పెంచుకున్నాడు. ఒక సంస్థలో పని చేయాలంటే కావాల్సిన విషయాలు అతని వద్ద సమృద్ధిగా లేవు.

విశాల్‌కు నైపుణ్యాలతోపాటు ఒక సంస్థలో పనిచేయడానికి కావాల్సిన అన్ని అర్హతలూ ఉన్నాయి.

సంభాషించేటప్పుడు దృష్టి సమన్వయం, శరీర భాష విషయంలో కూడా మెరుగ్గా ఉన్నాడు. ఓర్పు, దేన్నయినా స్వీకరించగల తత్వం, విశాల దృక్పథం, విశ్వసనీయత, నిబద్ధత.. వీటన్నిటిలోనూ పైమెట్టులోనే ఉన్నాడు.

అందుకే హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ అధికారి రవి అభ్యర్థిత్వాన్ని తిరస్కరించి, విశాల్‌ను ఎంపిక చేశారు.

విశ్వసనీయత

హెచ్‌ఆర్: మీతోపాటు ఇంకో సభ్యుడు, మేనేజర్‌లకు ఒక అరుదైన టెక్నాలజీలో ప్రావీణ్యం ఉంది. మీరు మీ బృంద సభ్యుడు, మేనేజర్‌తో కలిసి ఒక ప్రాజెక్టును దక్కించుకోవడానికి టెక్నికల్ ప్రెజెంటేషన్ ఇవ్వడానికి క్లయింట్ దగ్గరికి వెళతారు. అక్కడ మీలాగే వేరే సంస్థల వాళ్లూ వచ్చారు. అందరికీ మీ ప్రెజెంటేషన్ నచ్చింది. క్లయింట్ మీ ప్రతిభను గుర్తించారు. ఆ ప్రాజెక్టును మీ సంస్థకు ఇవ్వాలని నిర్ణయానికి వస్తారు. వారం రోజుల్లో నిర్ణయ ప్రకటన ఉంటుంది. ఈలోపు మీ పోటీ సంస్థ ప్రతినిధి మీ ముగ్గురినీ వారి సంస్థలో చేరమని ఆఫర్ ఇచ్చారు. ప్రస్తుత జీతభత్యాలకన్నా కొన్ని రెట్లు ఎక్కువగా ఇస్తామనీ, ఆ ప్రాజెక్ట్ వారికే వస్తుందన్నారు. మీ మేనేజర్, ఇంకో సభ్యుడూ చేరాలనే దృఢ నిర్ణయం తీసుకుని, మిమ్మల్ని ఒత్తిడి చేస్తారు. మీ ప్రస్తుత సంస్థకు ఆ ప్రాజెక్ట్ రాకపోతే రూ.50 కోట్ల ఆదాయం పోతుంది. ఆ పరిస్థితిలో మీరు ఏం చేస్తారు?

రవి: ఇది క్లిష్టమైన పరిస్థితి. వారితోపాటు చేరితే నా ఆదాయం పెరుగుతుంది. నా కెరియర్‌లో అదో పెద్ద జంప్. నా ప్రస్తుత పరిస్థితి నుంచి నేననుకున్న హోదాకి వెళ్లగలను. కానీ నమ్ముకున్న సంస్థకు నష్టం వస్తుంది. ఒకవేళ నేనొక్కడినే చేరకపోయినా మిగతా ఇద్దరి నిర్ణయం వల్ల ప్రాజెక్ట్ రాకపోవచ్చు. అప్పుడు నేనొక్కడినే మిగిలిపోతాను. దానివల్ల సంస్థతోపాటు నేనూ నష్టపోతాను. అలాంటప్పుడు విలువలకు పోకుండా ఆ ఆఫర్‌ను తీసుకోవడం మేలని భావిస్తాను.

విశాల్: ఇది సమస్యాత్మక విషయం. కానీ నేను ఆ సమస్యకు కారణాలు వెతుకుతాను. మా ప్రావీణ్యం వల్ల సంస్థకు పెద్ద ఆదాయాన్ని ఇచ్చే ప్రాజెక్ట్ ఇది. కానీ పోటీ వల్ల వేరొక సంస్థ దాన్ని దక్కించుకోడానికి ఎత్తుగడ వేసింది. స్వార్థ చింతనతో సహోద్యోగులతో చేతులు కలిపి సంస్థకు నమ్మకద్రోహం చేసి, నా మనసును కలుషితం చేసుకోలేను. ఆ ముద్ర నన్ను జీవితాంతం వెంటాడుతుంది. ఒక్కసారి విలువలు లేవు అనే ముద్రపడితే మార్కెట్‌లో ఇక నా ప్రొఫైల్‌కి విశ్వసనీయత ఏముంటుంది?

అందుకే పరిష్కారం వెతుకుతాను. మొదట నా హైరార్కీకి జరిగిన విషయాన్ని వివరిస్తాను. నా సహోద్యోగులతో కూడా మాట్లాడుతాను. వారు ఆ సంస్థకే కట్టుబడి ఉండాలంటే ఎక్కువగా ఏం ఆశిస్తారో తెలుసుకుంటాను. ఆ విషయాలను సంస్థకు తెలియజేస్తాను. సంస్థ ప్రాజెక్ట్‌ను కోల్పోవడం కన్నా వారి ఆశలను నెరవేర్చమని అడిగితే మధ్యవర్తిత్వం చేస్తాను. నా సహోద్యోగులు తమ నిర్ణయాన్ని విరమించుకోవడానికి నా వంతు ప్రయత్నం చేస్తాను.

విశ్లేషణ: రవిది యథాలాపంగా ఆలోచించే స్వభావం. బాధ్యతాయుతమైన, విలువలు కలిగిన మనస్తత్వం కాదు. దానివల్ల తను నష్టపోవడమే కాకుండా సంస్థను కూడా నష్టపరుస్తాడు. అదే విశాల్ మొదట బాధ్యత, తరువాత విలువలు, ఆఖరిగా వివేకమున్న అభ్యర్థి. అతను తన సామర్థ్యంతో సంస్థను ఎత్తుకు తీసుకువెళ్లడమే కాకుండా తను కూడా ఎదిగి లీడ్ చేయగలడు. కష్ట సమయాల్లో అండగా నిలబడి సంస్థ అభివృద్ధికి తోడ్పడగలడు.

విషయ వ్యక్తీకరణకు విలువైన మార్గం!

సివిల్స్, గ్రూప్స్, ఎస్ఐ తదితర పరీక్షల్లో కొన్ని ప్రశ్నలకు వ్యాసరూప సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందులో అభ్యర్థి పరిజ్ఞానంతోపాటు భావవ్యక్తీకరణ తీరును, తార్కికమైన ఆలోచనా విధానాన్ని పరిశీలిస్తారు. తెలిసిందంతా రాసేయడం, పదాడంబరాన్ని ప్రదర్శించడం లాంటి పొరపాట్లు చేయకుండా తెలుగు మాధ్యమం అభ్యర్థులు వివరణాత్మక జవాబులను, వ్యాసాన్ని ప్రభావపూరితంగా ఎలా రాయాలో తెలుసుకుందాం.

పోటీపరీక్షల్లో వ్యాసరచన మంచి మార్కులు తెచ్చుకోడానికి ఒక చక్కని మార్గం. తెలుగు మాధ్యమంలో రాసేవాళ్లు కొంచెం జాగ్రత్త వహిస్తే ఎక్కువ మార్కులు సాధించుకోవచ్చు. అర్హత పరీక్షల్లోనూ వ్యాసరచన ముఖ్యమైనదే. వ్యాసం అంటే విస్తరించడం, వివరించడం అని అర్థాలు. ఒక అంశాన్ని వివరించి అంటే పెంచి రాయడం. అంశం ఏదైనా దానికి సంబంధించిన తగిన విషయ పరిజ్ఞానం ఉంటేనే మంచి వ్యాసం రాయడం సాధ్యమవుతుంది.

డాక్టర్ ద్వానాశాస్త్రి

అర్థమయ్యేలా రాస్తే చాలు!

చక్కటి దస్తూరితో రాయడం మంచి వ్యాసం అనిపించుకోదు. రాతకు సంబంధించి అర్థమయ్యే విధంగా ఉంటే చాలు. వాక్యాల్లో వంకరటింకరలు ఉండకూడదు. కొందరు వాక్యాలను ఏటవాలుగా రాస్తారు. సమంగా రాయాలి. తెలుగు రాసేటప్పుడు భాషాదోషాలపై శ్రద్ధ వహించాలి. భాషాదోషాలంటే వ్యాకరణం ప్రకారం రాయడం కాదు. స్పష్టతతో అర్థభేదాలు లేకుండా రాయాలి.

ఉదాహరణకు– బావి అంటే నుయ్యి. చిన్న వత్తు ఇచ్చేశామంటే భావి అవుతుంది. దానికి అర్థం భవిష్యత్తు. శాకాహారం అంటే కూరగాయల ఆహారం. అదే శాఖాహారం అర్థం కొమ్మలతో ఆహారం. అలాగే పతకం రాయబోయి పతాకం రాస్తే చదివేవాళ్లు అయోమయంలో పడిపోతారు. ఇలా ఒకదాని బదులు ఇంకోటి రాస్తే వ్యాసం లక్ష్యం దెబ్బతింటుంది.

సాధారణంగా వచ్చే తప్పులను కొన్నింటిని పరిశీలిస్తే అవి ఎలా దొర్లుతాయో అర్థం చేసుకోవచ్చు. మొదటి పదం తప్పుగా రాసింది. బ్రాకెట్లో ఉన్నది సరైన ప్రయోగం. విద్య (విద్య), స్వశ్చం (స్వచ్ఛం), బోదించు (బోధించు), శ్రేష్టం (శ్రేష్ఠం), శతృవు (శత్రువు), రాయభారం (రాయబారం), మహత్యం (మహత్త్వం), వర్ధన్ (వర్ధం). కొంతమంది వత్తులు అక్షరాల పక్కన రాస్తుంటారు. దీని వల్ల కూడా అనర్థాలు జరుగుతాయి. అస్పష్టతలకు దారితీస్తుంది.

తక్కువగా ఆంగ్ల పదాలు

వీలైనంత వరకు ఆంగ్ల పదాలు రాకుండా చూడాలి. కొన్ని సాంకేతిక పదాలను ఆంగ్లంలో రాయవచ్చు. అయితే వాటికి అర్థాలు రాయడమో లేదా తెలుగు లిపిలో రాయడమో చేయాలి. కంప్యూటర్ అనే ఆంగ్ల పదాన్ని తెలుగులో రాయడాన్ని దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. కానీ ఇంటర్‌నెట్ వంటి పదాలకు ఇప్పుడు వాడుకలో ఉన్న 'అంతర్జాలం' ఉపయోగించవచ్చు.

విషయ విభజన అవసరం

ఇచ్చిన అంశాన్ని పలుకోణాల నుంచి విశ్లేషించాలి. అలా విశ్లేషిస్తున్నప్పుడు విషయాన్ని బట్టి పేరాలుగా విభజించుకోవాలి. అప్పుడే తెలియజేయాలనుకున్న అంశాన్ని పాఠకులు తేలిగ్గా గ్రహించగలుగుతారు.

జాతీయాలు, సామెతల వినియోగం

విషయం వ్యక్తీకరిస్తున్నప్పుడు సామెతలు, జాతీయాలను వాడవచ్చు. అయితే అవి సందర్భానికి అతికినట్లు ఉండాలి. వాటి అర్థాన్ని పూర్తిగా తెలుసుకొని వాడాలి. అప్పుడు భావానికి బలం వస్తుంది. పరానికి అనుకూలంగా ఉంటుంది.

ఉదాహరణకు పాకిస్థాన్ మనకి తలనొప్పిగా మారింది. ఒప్పందాలను ఉల్లంఘిస్తోంది. మనకి నష్టం కలిగిస్తోందని చెప్పడానికి 'పాకిస్థాన్ మనకు పక్కలో బల్లెంలా ఉంది' అంటే మరింత ప్రభావపూరితంగా ఉంటుంది. అలాగే 'ప్రభుత్వాలు ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోవడం లేదు' అనే విషయాన్ని 'చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా..' అని చెప్పడం బాగుంటుంది.

ప్రారంభమే కీలకం

వ్యాసాన్ని ఎలా ప్రారంభించాలి. ఆంగ్లంలో 'వెల్ బిగన్ ఈజ్ హాఫ్ డన్' అంటారు. ఇచ్చిన అంశాన్ని బట్టి ప్రారంభం ఉండాలి. చక్కటి ఉపోద్ఘాతం లేదా ఒక సూక్తితో ప్రారంభించడం బాగుంటుంది. పూర్వ వివరాలు, ఆవశ్యకత, ఇచ్చిన అంశం ప్రాధాన్యం లేదా అవసరాన్ని గురించి తెలియజేస్తూ మొదలు పెట్టవచ్చు. ప్రారంభం బాగుంటే ఎగ్జామినర్ సానుకూల దృక్పథంతో మంచి మార్కులు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

ముగింపు జ్ఞానాన్ని మదింపు చేస్తుంది

విషయ విశ్లేషణ చేశారు. లోపాలను లేదా మంచి చెడులను వెల్లడించారు. అయినా చివరి పేరాలో ముగింపు కూడా చాలా ముఖ్యం. అభ్యర్థి అంచనా ఏమిటి? ఏ వైపు మొగ్గుతున్నాడు? కారణాలేమిటి? సొంత అభిప్రాయాలు కలిగి ఉన్నాడా? వాటిని సమర్థించుకోగలుగుతున్నాడా అనే అంశాలు కూడా ఇతరుల కంటే ఎక్కువ మార్కులు సంపాదించి పెడతాయి. చివరకు తేలిందేమిటో స్పష్టంగా చెప్పాలి. అది అభ్యర్థి ఆత్మవిశ్వాసాన్ని తెలుపుతుంది. నిర్దిష్ట పదాల్లో రాయాల్సి వచ్చినప్పుడు నిబంధన అతిక్రమించకుండా సంక్షిప్తత పాటించాలి. ఒక ఇరవై పదాలు అటూ ఇటూ ఉన్నా ప్రమాదం లేదు. పూర్తి చేయకుండా వదిలేయకూడదు. ఇందుకోసం వ్యాసరచనను తప్పనిసరిగా సాధన చేయాలి.

నోటీస్ బోర్డు

ప్రవేశాలు

ఎన్ఐటీ, రవుర్కెలా

కోర్సు: ఎంబీఏ
కాలవ్యవధి: 2 సంవత్సరాలు
సీట్ల సంఖ్య: 60
అర్హత: బీఈ/ బీటెక్/ బీఆర్క్/ బీఎస్సీ ఇంజినీరింగ్/ ఎంఎస్సీ/ ఎంఏ ఎకనామిక్స్.
ఎంపిక: అకడమిక్ ప్రతిభ, జాతీయస్థాయి ప్రవేశపరీక్ష స్కోరు, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆన్‌లైన్
దరఖాస్తు ఫీజు: రూ. 500
చివరితేది: 15.03.2018
https://nitrkl.ac.in/

ఫెలోషిప్స్

డీఆర్‌డీఈ, గ్వాలియర్

డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీఓ)కి చెందిన ఈ సంస్థ మధ్యప్రదేశ్‌లో ఉంది.

ఫెలోషిప్: డీఆర్‌డీఓ జూనియర్ రిసెర్చ్ ఫెలో (జేఆర్ఎఫ్) **ఖాళీలు:** 07 **స్టైపెండ్:** నెలకు రూ.25,000తోపాటు హెచ్‌ఆర్ఏ. **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ప్రథమ శ్రేణిలో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు నెట్. **వయసు:** 28 సంవత్సరాలకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ **చివరితేది:** 04.03.2018
చిరునామా: ది డైరెక్టర్, డీఆర్‌డీఈ, ఝాన్సీ రోడ్, గ్వాలియర్.

ప్రభుత్వ ఉద్యోగాలు

నేషనల్ లా యూనివర్సిటీ, జోధ్‌పూర్

పోస్టులు: అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్ అసిస్టెంట్
విభాగాలు: లా ఆఫ్ ఎవిడెన్స్, ఇంటర్‌ప్రిటేషన్ ఆఫ్ స్టాట్యూట్స్, లేబర్ లా, హ్యూమానిటేరియన్ లా, ఇంటర్నేషనల్ లా, ఐపీఆర్, కాన్‌స్టిట్యూషనల్ లా.
అర్హత, వయసు, ఎంపిక, ఖాళీలు: వర్సిటీ నిబంధనల ప్రకారం.
దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.
చివరితేది: 15.02.2018
వెబ్‌సైట్: http://nlujodhpur.ac.in/

ఇంద్రప్రస్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, దిల్లీ

పోస్టులు: నాన్ అకడమిక్ పోస్టులు (మేనేజర్-01, జూనియర్ మేనేజర్-03)
అర్హత: పీజీ ఇన్ లైబ్రరీ సైన్స్, ఏదైనా పీజీ.
వయసు: మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, జూనియర్ మేనేజర్ పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్
చివరితేది: 16.02.2018
వెబ్‌సైట్: http://iiitd.ac.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

వాడుక భాషే వాడాలి

తప్పులు లేకుండా రాయాలన్నంత మాత్రాన వ్యాకరణ భాష లేదా మిత్రలాభం (చిన్నయ సూరి) భాష ఉపయోగించాలని కాదు. ఆ భాష రాయడం ఈ రోజుల్లో అనర్థం కూడా. వాడుక భాషలోనే వ్యాసం రాయాలి. అంటే పత్రికా భాష అని చెప్పవచ్చు. పోటీపరీక్షల్లో విషయమే అతి ముఖ్యం. ఆ విషయానికి స్పష్టతను ఇచ్చేది రాత. మనం మాట్లాడే భాషలోనే రాయాలి. కొందరు తమ ప్రాంతీయ భాషా పదాలు (మాండలిక పదాలు) వాడతారు. తప్పుకాదు కానీ ఎగ్జామినర్‌కి తెలియకపోతే మార్కులు తగ్గవచ్చు. అలాంటివి ఉపయోగించినప్పుడు బ్రాకెట్‌లో దాని అర్థాన్ని రాయాలి.